రుణమాఫీకి కుటుంబ నిర్ధారణ

టేకులపల్లి, ఆగస్టు 28: రెండు లక్షల రూపాయల రుణం మాఫీలో కోసం రైతులు తమ కుటుంబ నిర్ధారణ కోసం వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వేల్పుల బాబురావు కోరారు. రెండు లక్షల రూపాయలకంటే ఎక్కువ రుణం ఉన్న రైతుల కుటుంబ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని ఏవో అన్నపూర్ణ బుధవారం టేకులపల్లిలో నిర్వహించారు. దీనిని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ....రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు రుణ మాఫీ కోసం తమ కుటుంబ సభ్యులు, బ్యాంక్ లోన్ వివరాలను అధికారులకు తెలిపి, వారితో కలిసి ఫొటో దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయించుకోవాలని వివరించారు. ఇల్లెందు ఏడీఏ లాలాచంద్ తదితరులు పాల్గొన్నారు.

వివరాల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబురావు

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 28: రేషన్ కార్డు లేని కారణంగా రుణం మాఫీ కాని రైతులు.. తమ కుటుంబ సభ్యుల వివరాలను సెల్ ఫోన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని ఏవో అనూష అన్నారు. ఆమె బుధవారం స్థానిక రైతు వేదికలో కొందరు రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. రైతులు, వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం గ్రామసభలను నిర్వహిస్తామన్నారు.

పాల్వంచ రూరల్, ఆగస్టు 28: సాంకేతి కారణాలతో రుణ మాఫీ వారిలో అర్హులను గుర్తించేందుకు వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో విచారణ ప్రారంభించారు. మండలంలోని నాగారం, నారాయణరావుపేట, దంతెలబోర పంచాయతీల్లో బుధవారం ఏవో శంభో శంకర్ పర్యటించారు. రేషన్ కార్డు లేని 20 మంది రైతులను రుణమాఫీకి అర్హులుగా గుర్తించారు. వారి కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 28: బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరులకు సీపీఎం నాయకులు బుధవారం నివాళులర్పించారు. భూక్యా రమేష్, బ్రహ్మాచారి, అన్నవరపు సత్యనారాయణ, భూక్యా రమేష్, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, ఆగస్టు 28: స్థానిక ఏలూరి భవన్‌లో బుధవారం విద్యుత్ అమరవీరుల వర్ధంతిని సీపీఎం నిర్వహించింది. అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించింది. నాయకులు అబ్దుల్ నభి, తాళ్ళూరి కృష్ణ, మహమూద్, ఆర్‌బీజే రాజు, సత్యనారాయణ కోరి, భద్రు తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ ఉద్యమ అమరుల చిత్రపటాలకు గోవింద్ సెంటర్‌లో అఖిలపక్ష నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.సారయ్య, సీతారామయ్య, తుపాకుల నాగేశ్వరరావు, అన్వర్‌బాష, ఆలేటి కిరణ్, షేక్ యాకూబ్‌షావలి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

దేవస్థానంలో సిబ్బంది విధుల్లో మార్పు

బూర్గంపాడు(భద్రాచలం), ఆగస్టు 28: భద్రాచలం దేవస్థానంలోని ప్రసాదాల కౌంటర్ విభాగంలో పనిచేసే పలువురు సిబ్బంది విధుల్లో మార్పు చేస్తూ దేవస్థానం ఈవో రమాదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన ఆలయం టిక్కెట్ కౌంటర్‌లో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ చంటికుమార్‌ను ప్రసాదాల కౌంటర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రసాదాల కౌంటర్‌లో పనిచేసే సతీష్‌కు అదే విభాగంలో రిలీవర్‌గా బాధ్యతలు అప్పగించారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయాలి

ఆళ్ళపల్లి, ఆగస్టు 28: ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖయ్యూం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం పేద ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు మంజురు చేసిందని, ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు పంపిణీ చేయలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినప్పటికీ కుట్టు మిషన్లు పంపిణీ చేయచకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. మిషన్ల పంపిణీని తక్షణమే చేపట్టాలని కోరారు.

ఘనంగా ఉట్ల పండుగ వేడుక

ఉట్ల వేడుకను నిర్వహిస్తున్న అర్చకులు

బూర్గంపాడు(భద్రాచలం), ఆగస్టు 28: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా బుధవారం ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు. దేవస్థానంలో మధ్యాహ్నం 3.15 గంటలకు దర్బార్ సేవ అనంతరం తిరువీధి సేవ, ధ్వజస్తంభం వద్ద ఉట్లు కొట్టుట కార్యక్రమాలను నిర్వహించారు. అశేష భక్తజనం నడుమ ఉట్ల వేడుక వైభవంగా జరిగింది.

సేవ్ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

బూర్గంపాడు(భద్రాచలం), ఆగస్టు 28: అభయ ఆంజనేయస్వామి ఆలయం పక్కన సేవ్ భద్రాద్రి ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్‌కు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, సతీమణి ప్రవీణతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సేవ్ భద్రాద్రి అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ టీమ్ ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్‌కు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు, వరదల సమయంలో ముంపు ప్రాంత ప్రజలకు పునరావాస కేంద్రాలుగా కమ్యూనిటీ హాల్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, పరిమితి సోమశేఖర్, గాదె మాధవరెడ్డి, ముని కేశవ్, రత్నం రమాకాంత్, బోగాల శ్రీనివాస్‌రెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి, మహ్మద్ జిందా, దొడ్డి పట్ల కోటేష్, మామిడి పుల్లారావు, గాడి విజయ్, మాచినేని భాను పాల్గొన్నారు.

'నేతకానీ' ప్రజల సమస్యలు పరిష్కరించాలి

గుండాల, ఆగస్టు 28: ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్సీ(నేతకానీ)కులానికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు జాడీ గోవర్ధన్ అన్నారు. బుధవారం తూరుబాకలో జరిగిన కార్యక్రమంలో గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాడీ గోవర్ధన్, ఉపాధ్యక్షుడు జనగం ఆగయ్య, కార్యదర్శి దుర్గం హరీష్, ప్రధాన కార్యదర్శి దుర్గం రామారావు, ప్రధాన కార్యకర్త దుర్గం చలపతిరావు, యువజన సంఘం అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షుడు గాందెర్ల వీరస్వామి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు, ఐడీటీఏలో నేతకానీలకు 5 శాతం రిజర్వేషన్, డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

కోనో కార్పస్ మొక్కల తొలగింపు

మొక్కలు తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

మణుగూరు టౌన్, ఆగస్టు 28: మున్సిపాలిటీ పరిధిలోని డివైడర్లపై ఏపుగా పెరిగిన కోనో కార్పస్ మొక్కలను బుధవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఏపుగా పెరిగిన మొక్కలపై పశువులు వాలకపోవడంతో పాటు, రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డివైడర్ల మధ్య నాటిన మొక్కలను మిషన్ల ద్వారా మొత్తం తొలగించారు. మధ్యలో విద్యుత్ వైర్లు ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మొక్కలు తొలగించారు.

రుణమాఫీ కోసం దరఖాస్తులు అందజేత

రుణమాఫీకి దరఖాస్తులు ఇస్తున్న రైతులు

దుమ్ముగూడెం, ఆగస్టు 28: రుణమాఫీ మూడో విడతలో కొంతమంది రైతులకు మాత్రమే రుణ మాఫీ వర్తించింది. కాగా తాజాగా 890 మంది రైతు కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ నంబర్, కుటుంబానికి సంబంధించిన వివరాలను అనుసంధానం చేస్తూ దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరిస్తున్నది. మండలంలో రుణమాఫీ కాని రైతులందరూ రుణమాఫీ కోసం రైతులు నర్సాపురం రైతు వేదికలో దరఖాస్తులు అందజేస్తున్నారు. బుధవారం 60 మంది రైతుల వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతోపాటు పంచాయతీ కార్యదర్శి సంతకాలు కాకుండా గెజిటెడ్ సంతకాలతో ఇవ్వాలని తెలపడంతో రైతులందరూ గెజిటెడ్ సంతకాలు చేయించి తిరిగి పత్రాలను అందజేస్తున్నారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ

చంద్రుగొండ, ఆగస్టు 28 : మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ నుంచి జూలూరుపాడు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా రూ.3.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం శ్మశాన వాటికకు రహదారి లేకపోవడంతో అంబేద్కర్ కాలనీవాసులు పడుతున్న కష్టాలను గుర్తించిన ఆయన రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ భవనంలో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చుంచుపల్లి, ఆగస్టు 28: చుంచుపల్లిలోని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని సుజాతనగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆయుర్వేద డాక్టర్ శ్రీలత బృందం నిర్వహించింది. 50 మంది సీనియర్లకు, కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చింది. విద్యానగర్ హెల్త్ సెంటర్ డాక్టర్ పద్మ కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, సభ్యులు రాజేంద్రప్రసాద్, కామేశ్వరరావు, మైనేని నాగేశ్వరరావు, గురుమూర్తి, కొండా రాములు తదితరులు పాల్గొన్నారు.

నూతన కోర్టు భవనాలకు భూమి పూజ

భూమి పూజ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

చుంచుపల్లి, ఆగస్టు 28: జిల్లా కోర్టు భవనాల సముదాయంలో నూతనంగా అదనపు జిల్లా కోర్టుల భవనాలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ బుధవారం భూమి పూజ చేశారు. న్యాయమూర్తులు గొల్లపూడి భానుమతి, బత్తుల రామారావు, సుచరిత, సాయిశ్రీ, శివ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఆర్ విద్యార్థులకు ఓరియంటేషన్

మాట్లాడుతున్న చైర్‌పర్సన్, హాజరైన విద్యార్థులు

పాల్వంచ, ఆగస్టు 28: స్థానిక కేఎల్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కేఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్‌పర్సన్ నాగమణి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఈ నాలుగేళ్ల ఇంజినీరింగ్‌లో పటిష్ట పునాది నిర్మించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టూల్ బాక్సుల్లో పాములు

రామవరం, ఆగస్టు 28: సింగరేణి కొత్తగూడెం ఏరియా పీవీకే 5 ఇంక్లైన్ గని వద్ద కార్మికులకు లాకర్ బాక్సులు లేకపోవడంతో, వారి టూల్ కిట్లలో పాములు చేరుతున్నాయి. కార్మికులు గని లోపలి వెళ్తున్నప్పుడు, తిరిగి వచ్చిన తర్వాత తమ సామాన్లను ఈ బాక్సుల్లో భద్రపరుస్తుంటారు. విధులకు వచ్చినప్పుడు బాక్సులు తెరిస్తే.. పాములు కనిపిస్తున్నాయి. ఇటీవల ఇలా తరచూ జరుగుతుండడంతో కార్మికులు బెంబేలెత్తుతున్నారు. తమకు లాకర్ బాక్సులు ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

బేషరతు రుణ మాఫీకి ధర్నా

టేకులపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

టేకులపల్లి, ఆగస్టు 28: రైతులకు బేషరతుగా రుణ మాఫీ చేయాలన్న డిమాండుతో తహసీల్ కార్యాలయం ముందు ఏఐకేఎంఎస్ నాయకులు. బుధవారం ధర్నా చేశారు. తహసీల్దార్ నాగభవానికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రామచంద్రు, ప్రసాద్, కల్తి వెంకటేశ్వర్లు, స్వామి, లక్ష్మి, ఈసాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, ఆగస్టు 28: రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలన్న డిమాండుతో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులు బుధవారం ఇల్లెందు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు తుపాకుల నాగేశ్వరరావు, నాయకులు ఎల్.చిన్న రామస్వామి, విజయ్, మధు, చింత రజిత, వాంకుడోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ఇవ్వాలని ఆందోళన

ఇల్లెందు రూరల్, ఆగస్టు 28: ఆర్టీసీ ఇల్లెందు డిపోకు కొత్త బస్సులు ఇవ్వాలన్న డిమాండుతో పీవోడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు బుధవారం డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. చంద్ర అరుణ, వాంకుడోత్ అజయ్, ఎదల్లపల్లి సావిత్రి, బుర్ర రాఘవులు, దేవా, ముత్తక్క తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

టీబీపై అవగాహన

మాట్లాడుతున్న వైద్యురాలు

ఇల్లెందు రూరల్, ఆగస్టు 28: టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై మండలంలోని నెహ్రూనగర్, చెన్నంగుల గడ్డ హాస్టల్ విద్యార్థులకు కొమరారం పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక బుధవారం అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి ఆకలి తగ్గినా, బరువు తగ్గినా, సాయంత్రం జ్వరం వచ్చినా, చెమటలు పట్టినా.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలని చెప్పారు. వైద్యులు సూచించిన మాత్రలను వేసుకుంటూ పోషకాహారాన్ని తీసుకుంటే ఈ వ్యాధి తగ్గుతుందని చెప్పారు. 15 మంది నుంచి శాంపిల్స్ తీసుకున్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల వినతి

వినతిపత్రం ఇస్తున్న పెంపకందారులు

దమ్మపేట, ఆగస్టు 28: గొర్రెలు, మేకలకు వ్యాధి నివారణ మందులు ఇవ్వాలని కోరుతూ పెంపకందారులు బుధవారం దమ్మపేట పశు వైద్య కేంద్రంలో వినతిపత్రం ఇచ్చారు. తెల్లమేకల సత్తిబాబు, పదిలం వెంకటేశ్వరరావు, పాకనాటి నాగేంద్ర, తాళ్ల సాయి, ఒరుగంటి అప్పారావు, గాయం విష్ణు పాల్గొన్నారు.

నేడు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 28: అన్నపురెడ్డిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశాలకు గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలలో ఖాళీ సీట్ల భర్తీకి ఉదయం 10.00 గంటలకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

చెక్కులు పంపిణీ

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 28: మండలంలోని జమ్మిడెం, ఉట్లపల్లి, కేశప్పగూడెం, వినాయకపురం, నారాయణపురం, ఆసుపాక గ్రామాల్లో కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను వారి ఇళ్ల వద్ద బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అందజేశారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, తుమ్మ రాంబాబు, ప్రమోద్, చిన్నంశెట్టి సత్యనారాయణ, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

1న పెన్షన్ విద్రోహ దినం

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): వచ్చే నెల 1న పెన్షన్ విద్రోహ దినం నిర్వహణపై చర్చించేందుకు బుధవారం ఐడీవోసీలో జిల్లా జేఏసీ సమావేశమైంది. వచ్చే ఆదివారం ఒకటో తేదీన ఉదయం 9.00 గంటలకు అన్ని సంఘాల ప్రాథమిక సభ్యులంతా తమ బాధ్యుల ఆధ్వర్యంలో కొత్తగూడెం ఓల్డ్ బస్ డిపో కొత్తగూడెం నుంచి అమరవీరుల స్థూపం వరకు నిరసన పాదయాత్ర చేపట్టాలని కోరుతూ ఈ సమావేశం తీర్మానించింది. అధ్యక్షుడు అమరనేని రామారావు, సెక్రటరీ జనరల్ సంగం వెంకటపుల్లయ్య, బాధ్యులు కృష్ణయ్య, రాజు, డీవీ, రవి, తుక్కని శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, రమేష్‌బాబు, కిరణ్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

పాత డిజైన్‌తోనే 'సీతారామ' నిర్మించాలి

జూలూరుపాడు, ఆగస్టు 28: సీతారామ ప్రాజెక్టును పాత డిజైన్ ప్రకారమే నిర్మించి, జూలూరుపాడు మండలానికి సాగునీటిని అందించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వినోభానగర్ గ్రామ సమీపంలో నిర్మాణంలోగల సీతారామ లింక్ కెనాల్‌ను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..సీతారామప్రాజెక్ట్ డిజైన్ మార్చి నీళ్లను తమ నియోజకవర్గాలకు తరలించుకు వెళ్లేందుకు మంత్రులు ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగానే ప్రభుత్వం లింక్ కాలువకు నిధులు మంజూరు చేసి ఆగమేఘాలపై పనులు చేపడుతున్నదని ఆరోపించారు. పాత డిజైన్ ప్రకారం నిర్మాణం పూర్తి చేసి, జిల్లాలోని 20 మండలాలకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు తంబర్ల నర్సింహారావు, శివ, బన్నీ, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బూర్గంపాడు (భద్రాచలం), ఆగస్టు 28: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

యువకుడి అనుమానాస్పద మృతి

వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ మేడ ప్రసాద్

మణుగూరు టౌన్, ఆగస్టు 28: మండలంలోని ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మణుగూరులోని బాపనకుంటలో చోటు చేసుకుంది. ఎస్ఐ మేడ ప్రసాద్ కథనం ప్రకారం.. ఆటో డ్రైవర్‌గా ఉన్న గుమ్మడెల్లి శివ(26) భార్య సంగీతతో కలిసి విప్పలసింగారం గ్రామంలో నివసిస్తున్నాడు. మద్యానికి బానిసైన శివ తరచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో భార్య మున్సిపాలిటీ పరిధిలోని తల్లిగారి ఇల్లు అయిన బాపనకుంటకు వచ్చింది. దీంతో మంగళవారం రాత్రి బాపనకుంటలో గొడవకు దిగిన శివ అదే ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి రిమాండ్

మణుగూరు టౌన్, ఆగస్టు 28: మండలంలోని పగిడేరు గ్రామంలో కొర్సా బుచ్చిరాములును మంగళవారం కొడుకు సూర్యం కర్రలతో కొట్టి హతమార్చిన విషయం విధితమే. బుధవారం పేరంటాల చెరువు సమీపంలో నిందితుడు సూర్యాన్ని అదుపులోకి తీసుకున్నామని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యానికి రెండు దశాబ్దాల క్రితం బయ్యారానికి చెందిన మహిళతో వివాహమైంది. సూర్యం తాగుడుకు బానిస కావడంతో 8 సంవత్సరాల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. మద్యానికి బానిసైన సూర్యం తండ్రికి ఉన్న ఆరు ఎకరాల భూమిని వాటా పంచి ఇవ్వమని రోజూ గొడవ పడుతూ ఉండేవాడు. వృద్ధ దంపతులు మనవడికి, మనువరాలికి సమాన వాటా అని తేల్చి చెప్పారు. బుచ్చిరాములును హతమార్చితే ఆస్తి మొత్తం తనదే అవుతుందని భావించిన సూర్యం మంగళవారం పత్తి చేలో పనిచేస్తున్న తండ్రిపై కర్రలతో కొట్టి దాడి చేసి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

'మేం విలేకరులం.. పెట్రోల్ పోయించాలి'

చంద్రుగొండ, ఆగస్టు 28: తాము విలేకరులమంటూ చంద్రుగొండ మండల ప్రత్యేకాధికారి సంజీవరావును బెదిరించిన ఇద్దరి బుధవారం కేసు నమోదైంది. ఎస్సై స్వప్న తెలిపిన వివరాలు.. మండల ప్రత్యేకాధికారి సంజీవరావుకు ఖమ్మం నగరానికి చెందిన అభిషేక్, అప్పారావు ఫోన్ చేశారు. తాము విలేకరులమని, మీటింగ్‌కు వెళ్తున్నామని, తమ కారులో పెట్రోల్ పోయించాలని బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. దీనికి ఆ అధికారి నిరాకరించారు. అయినప్పటికీ ఆ ఇద్దరు వ్యక్తులు పలుమార్లు ఫోన్‌లో ఇబ్బంది పెట్టారు. దీనిపై సంజీవరావు ఇచ్చిన ఫిర్యాదుతో అభిషేక్‌పై, అప్పారావుపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

అశ్వారావుపేట, ఆగస్టు 28: లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. దమ్మపేట మండలం మందలపల్లి గ్రామస్తుడు సిద్దిరాల రఘురామ్(34) మంగళవారం ద్విచక్ర వాహనంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బుట్టాయిగూడెం మండలం కన్నాపురం వెళ్లి, బుధవారం స్వగ్రామానికి తిరిగొస్తున్నాడు. మండలంలోని నారంవారిగూడెం కాలనీ సమీపంలో, ఢిల్లీ నుంచి రాజమండ్రి వెళుతున్న గూడ్స్ లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రఘురామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని, మృతదేహాన్ని ఎస్సై శివరామకృష్ణ పరిశీలించి వివరాలు సేకరించారు. రఘురామ్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సుభాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రఘురామ్ భార్య నాగమల్లేశ్వరి ఫిర్యాదుతో కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

కూల్ డ్రింక్స్ వ్యాన్ ఢీకొని వృద్ధుడు..

దమ్మపేట, ఆగస్టు 28: కూల్ డ్రింక్స్ వ్యాన్ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. దమ్మపేటకు చెందిన శేషగిరి నాగేశ్వరరావు(60) ద్విచక్ర వాహనంపై తిరుగుతూ కూరగాయలు అమ్ముతుంటాడు. అతడు బుధవారం అప్పారావుపేట రోడ్డు నుంచి పాల్వంచ-దమ్మపేట రోడ్డును దాటుతుండగా కూల్ డ్రింక్స్ లోడ్‌తో పాల్వంచ వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. అప్పటికే, ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయిన ఆ వ్యాన్, అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు.. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

వివాహిత అదృశ్యం

చంద్రుగొండ, ఆగస్టు 28: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్సై గంజి స్వప్న తెలిపిన వివరాలు.. మండలంలోని దుబ్బతండాకు చెందిన వివాహిత బానోత్ సుజాత, ఈ నెల 3న టీటీసీ పరీక్ష రాసేందుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె భర్త సేవియా ఫిర్యాదుతో, వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, ఆగస్టు 28 : ప్రభుత్వ స్థలాలు ఆక్రమించవద్దన్న ఫ్లెక్సీకి మద్దతు తెలిపినందుకు తేజావత్ రాములు, అతని కుటుంబసభ్యులపై దాడి చేసిన ఘటన పాల్వంచ మండలంలోని కోడిపుంజులవాగు గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోడిపుంజులవాగు ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న కొంత ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నాల్లో ఉండగా... ఆ పాఠశాల హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శి బుధవారం ప్రభుత్వ స్థలాలు ఆక్రమించవద్దని ఒక ఫ్లెక్సీ అక్కడ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీకి కోడిపుంజువాగుకు చెందిన తేజావత్ రాములు మద్దతు పలికాడు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక అదే గ్రామానికి చెందిన సుజాత, రమేష్, కార్తీక్ అనే వ్యక్తులు ఫ్లెక్సీకి ఎందుకు మద్దతు పలికావు అంటూ రాములుపై దౌర్జన్యం చేసి అతడిని, అతడి భార్య, కుమార్తెను కొట్టి గాయపర్చారు. రాములు ఫిర్యాదుతో సుజాత, రమేష్, కార్తీక్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాధాకృష్ణ మాస్టర్ కన్నుమూత



బూర్గంపాడు (భద్రాచలం), ఆగస్టు 28: భద్రాచలం దేవస్థానంలో చాలా సంవత్సరాలుగా శ్రీరామ చంద్రునికి సుప్రభాతం, దర్బార్ సేవలో విశేష సేవలు చేసిన, గుట్ట స్కూల్‌లో మాస్టర్‌గా పనిచేసిన రాధాకృష్ణ మాస్టర్ బుధవారం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆలయ ఈవో, సిబ్బంది ఆయన ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616